

# తడిసిన చొక్కా

మురారి సుబ్బారావు

ఎండ భరించరానిదిగా వుంది.

'నాలాంటి ముసలివాణ్ణి ఇంకా కష్ట పెట్టాలనేదే నీ ధ్యేయమా స్వామీ? శివుని మూడవ కంటి కనుకొలకుల మధ్య నుంచి ప్రచండ రూపుడవై బయలు దేరావు.'

ఒక్కసారి పైకి చూడబోయి ఆ కాంతి వేగాన్ని భరించలేక కళ్ళు మూసుకున్నాడు రామ్మూర్తిగారు. అంతలోనే షాక్ తగిలినట్లయి తూలి పడబోయారు. ఇంతలో రెండు చేతులు అతన్ని అదిమిపట్టేయి.

"ఏంటి బాబూ అట్టా ఐపోయారు. ఇట్టా కూకోండి" అంటూ తాటాకు గొడుగు క్రింద తన ప్రక్కనే కూర్చోబెట్టేడు ఆ మనిషి. కాస్త నీడ దొరికి తెప్పరిల్లారాయన. వాడు.... ఆ చెప్పులు కుట్టేవాడు.... తన పని తాను చేసుకుపోతున్నాడు. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. చెవుల్లో మాత్రం వేడిగాడ్పుల హోరు. కళ్ళముందు రక్తం పారబోసినట్లుగా వుంది ఎండ.

"టైంమెంతవుతుందోయ్" రామ్మూర్తిగారడిగారతన్ని.

"ఉండండి" అన్నాడు. ప్రక్కనే వున్న సంచిలోంచి ట్రాన్సిస్టర్ తీసి ఆన్ చేసాడు. తెలుగు పాటలొస్తున్నాయ్. "ఒంటి గంటైందండి. ఇగో ఈ సెప్పులు కుట్టిచ్చేత్తే భోజనానికెళ్ళిపోవాల" అన్నాడు. తిరిగి చెప్పులు కుట్టడంలో నిమగ్నమయ్యేడు. రేడియోలో వస్తున్న పాటకు లయగా తలాడిస్తూ మధ్య మధ్య కూనిరాగాలు తీస్తూ వాడు చెప్పులు కుడుతున్నాడు.

అతని పనే బాగుంది. పాట వింటూ కూనిరాగాలు తీసుకుంటూ ఎండనీ, పడుతున్న కష్టాన్నీ లెఖ్ఖచేయకుండా నాటి బాధలకు అతీతుణ్ణనే జిజ్ఞాసిలా, ఆనందమయ జీవితాన్ని బోధించే ప్రవక్తలా ఆ తాటాకుగొడుగు క్రింద కూర్చుని చకచకా పనిచేస్తున్నాడు.

ఈ సంసార జలధిలో అతడు నాకన్నా చిన్నవాడే కాబోలు. అయితేనేం. అతని జీవితం ఉత్తుంగ తరంగమై తేలియాడుతుంటే తన జీవితం తుఫానుల మయం.

తన గుండెల్లో వేయి సముద్రాల ఘోష. తనని పిచ్చివాణ్ణి, పిరికివాణ్ణి చేస్తున్నాయి. సన్నగా మూల్గేరు రామ్మూర్తిగారు.

"నీ పనే బాగుందోయ్" అన్నారు.

ఆయన కళ్ళలోకి చూసి నవ్వుతూ "ఏదోలెండి బాబూ" అన్నాడు.

"నీ పేరేమిటోయ్."

"సాంబులంటారండి."

"రోజు కెంత సంపాదిస్తావ్."

"ఐదో ఆరో వస్తాయండి. ఒక్కో రోజు రూపాయి కూడా రాదండి. మరో రోజు ఎన్నో సెప్పులొస్తాయి. కుట్టటానికి సైం సాల్దండి."

"మరి వచ్చే ఆదాయం సరిపోతుందా"

"అదే సరిపోద్దండి. మా యింటిది చాలా యిళ్ళలో పాచిపనేజ స్తదండి. నా పెద్ద కొడుకు హోటల్లో సర్వరండి. ఇంకొద్దిలో హోటలు పెట్టేస్తాడండి. రెందోవాడు సారా కంపెనీలో చేత్తాడండి...." అంతలోనే నవ్వుతూ "అప్పుడప్పుడు నాకో సీసా మందుతెస్తాడండి" అన్నాడు సాంబులు.

సాంబులు మాటలు విని భారంగా నిట్టూర్చేరు. ఇందులోనూ అతని బ్రతుకే నయం.

"నీ పెళ్ళాంబిడ్డలు నీతో బాగా మాట్లాడతారా" ఆశగా ప్రశ్న వేశారు.

"ఓ యస్సండి. నా మాట నా పెల్లాం కాదనదండి. దాని కోరిక నేను కాదన్నండి. ఇక కొడుకులు....ఇంతవరకూ బాగానే వున్నారండి. నేనూ సంపాయిస్తున్నాను.అళ్ళూ సంపాయిస్తున్నారు. అళ్ళు నా మాట కాదంటే నాకేటండి. సొతంత్రంగా మరో సోటికిపోయినా ఎవరి కాళ్ళ మీద అళ్ళు బతగ్గలుం." అన్నాడు. గర్వంగా తరువాత చెప్పులు కట్టడం పూర్తియ్యే వరకూ ఎవరూ మాట్లాడుకోలేదు.

అర్ధరూపాయి సాంబులు చేతిలో పెట్టి "నా కంటే నువ్వే నయం సాంబులూ" అన్నాడు చెప్పులు చేతపట్టుకుంటూ.

సంతోషంగా నవ్వి, "తేంక్సండి. అదేటండి. సెప్పులు చేత్తోబట్టుకున్నారేటి? కాళ్ళకేసుకోండి. ఎండ మండిపోతోంది" అన్నాడు సాంబులు.

"ఇవి మా పెద్దబ్బాయి చెప్పులులే" అన్నాడు మొహం వెనక్కి తిప్పుకొని వెళ్ళిపోతూ.

సాంబులు బిత్తరపోయాడు.

* * *

"ఇవిగోరా నీ చెప్పులు" ఇంటికి వచ్చి కొడుకు గదిముందు నిలబడ్డ రామూర్తిగారి నివురుగప్పిన స్వరం.

"అక్కడ పెట్టి వెళ్ళండి" కొడుకు గదిలోనుంచే సమాధానం ఇచ్చేడు.

చెప్పులు అక్కడపెట్టి వెళ్ళి పెరట్లో పాకలో మంచంమీద కూర్చున్నాడు. చెమటతో తడిసిన చొక్కా విప్పి మంచం కోడుకి తగిలించారు. ఏ బాధామయ



స్థితినీ చూసి భరించలేక మూలకూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్న పసివానిలా వుంది, చెమటతో తడిసిన చొక్కా. వెనుకటి తీయటి స్మృతులను బద్ధలు కొట్టి అగాధాల్లోకి తోసేసిన చేదు నిజాలను కక్కుతోంది చెమటతో తడిసిన చొక్కా. వర్ణన కందని ఆయన చూపుల మధ్య పెల్లుబికిన వేడి కన్నీటి చుక్కలను పలకరిస్తూ ఊరటకలిగిస్తున్నట్లుంది చెమటతో తడసిన చొక్కా.

రామ్మూర్తిగారు గుమాస్తాగా బతికారు. అలాగే రిటైరయ్యారు. వచ్చే సంపాదనతో భార్యనీ, కలిగిన ఇద్దరు కొడుకుల్నీ, కూతుర్నీ జాగ్రత్తగా చూసారు. వారికి మంచి చదువులు చెప్పించారు. కూతురికి మంచి సంబంధం చూసి పెళ్ళిచేసారు. కోడళ్ళు కూడా వచ్చేరు. పిల్లలతో తానొక మిత్రునిలా చూడాలని వారికి కావలసినంత స్వేచ్ఛ ఇచ్చేరు.

రామ్మూర్తిగారికీ భార్య తులశమ్మకు వయసులో తొమ్మిదేళ్ళ తేడా వుంది. అదే వారి మధ్య అభిమానానికి, ప్రేమకు అడ్డుగోడగా నిలిచింది.

అతను ప్రేమగా చూసేకొద్దీ ఆమెలో అతనిపట్ల నిరసన భావం కలిగేది. ఆయన అనురాగం చూపే కొద్దీ ఆమె కు భావంగా వుండేది. ఆయన స్నేహాన్ని కనబరచిన ప్రతిసారి ఆమె విసుక్కునేది. ఆయన నచ్చజెప్పే కొద్దీ ఆమె బిర్రబిగిసేది.

తన ప్రతి చర్యా ఆమెకు అయిష్టత కలిగిస్తోందని గ్రహించారాయన. నిస్పృహ చెందేరు. పిల్లల విషయంలోనూ అదే జరిగింది. పిల్లలు తల్లి పక్షాన చేరేవారు. అప్పుడప్పుడు ఆమె

తనని తిట్టడం, తను పిల్లలను తిట్టడం, వాళ్ళ తల్లితో ఆ సంగతి చెప్పుకోవడం, తిరిగి ఇద్దరి మధ్యా యుద్ధం. ఈ రాద్ధాంతాన్ని భరించలేక, పరిష్కరించే ఓపిక, స్థితీ తనకు లేక పిల్లలకు స్వేచ్ఛ ఇస్తున్నానంటూ వదిలేశారు. తల్లిచుట్టూ చేరి ఆమె చెప్పినట్లే వింటూ ఆమె విపరీత ధోరణిని కూడా పట్టించుకున్నారు.

రిటైరయ్యాక పరిస్థితి మరీ దుర్భరంగా వుంది. కొడుకులు అంతకుముందు 'నాన్నగారూ' అని పిల్చేవారు. ఇప్పుడదీ లేదు. ఏదైనా చెప్పాలనుకుంటే సంబోధన లేకుండా ఏ గోడకో, కుర్చీకో చెబుతున్నట్లు మొహం తిప్పుకు మాట్లాడుతున్నారు. భార్య సరే సరి, కోడలు ఏమంటుందోనని వంటిల్లుదాటి బైటకు రావడం లేదు. కోడలు ప్రాపకం నిలబెట్టుకోపోతే ఏమంటుందోననే బెదురు. సంసారాన్ని వాళ్ళ పుట్టింటికి మోసేస్తుందేమోనని భయం ఆవిడకి. కాలం చేసే పరుగుని భార్యాబిడ్డలు అందుకోగలిగారు. ఆ రీతిగా మారి ప్రవర్తించసాగేరు. తనుమాత్రం వున్న చోటునే వున్నాడు. తనకేదో కావాలి. భార్యా పిల్లలు ఆప్యాయంగా పలుకరించాలని, తనపట్ల గౌరవాన్ని, అభిమానాన్ని చూపాలని వుంది. కల్మషం లేని ఆ పలుకరింతలో పరవశించాలనీ, ఆ తీయటి అనుభూతి ముందు మోకరిల్లాలని ఆయన కోరిక, తృష్ణ, ఇచ్ఛ.

మంచం కోడుకి తగిలించిన చొక్కా గాలికి ఎగిరిపడింది. ఆలోచనలు మారిపోయాయి. మూగగా నవ్వుకున్నాడు తన ఆశకి. 'ఎక్కడ తీరుతుంది తన కోరిక అంతే!'

ఇంతలో ఏదో ఆలోచన.

'సాంబులు ఎంత సంతోషంగా వున్నాడు. అతని చేతల్లో ఎంత ధైర్యం కనబడుతున్నాయో. కొడుకులమీద ఎంతో ప్రేమ. ఇప్పుడు వాళ్ళ తన దగ్గరే వున్నా రేపు ఏ గొడవైనా జరిగి విడిపోయినా తనకే బెంగ వుండదన్నట్లుగా మాట్లాడుతున్నాడు.తనూ వున్నాడు ఎందుకు కొడుకులను తన ఇష్టప్రకారం చదువు చెప్పించగలిగాడు. వాళ్ళనొక ఇంటివాళ్ళను చేసాడు. కూతురు బాగు చూసాడు. కూతురు సమస్య కాదిప్పుడు కొడుకులే వాళ్ళ తన యిష్టప్రకారం పెరిగారు కానీ తన కోరికలని, ఇష్టాలనీ పంచుకోలేదు. తన గురించి పట్టించుకోవడంలేదు. వారికొక నీడను కల్పించిన తనను హాయిగా నీడపట్టున ఉండనివ్వడంలేదు ఎప్పుడైనా చుట్టాలొచ్చినా పదిపైసలివ్వడానికి మొహం అదోలా పెడతారు వారిపట్ల తను బాధ్యతగా ప్రవర్తించి వారి బాగోగులు చూసినట్లు వారు తనని చూడడంలేదు. తప్పనిసరై ఇంటిపట్టున ఉంచి తిండిపెడుతున్నారు కాని పెద్దవాణ్ణనే జాలికాని, తల్లిదండ్రుల బాధ్యత మనదని కానీ గుర్తించడంలేదు. ఇక

కోడళ్ళొచ్చేరు. వారి కొంగుదాటి రాలేక పోతున్నారు. అంతా కోడళ్ళ యిష్టమే, స్వంత ఆలోచన, మాటతీరు మరచి పోయిన వాళ్ళు తనపట్ల చూపే పోషణ బాధ్యత, తప్పదని మాత్రమే, వేళకింత తిండి పెట్టడం, తోచినపని చెప్పడం తప్ప తనపట్ల ఏ ప్రత్యేక శ్రద్ధలేదు.

ఇటువంటి స్థితిలో తను స్థిమితంగా ఎలా ఉండగలడు. సాంబులుకున్న స్వభావాన్ని ఎలా అలవరచుకోగలడు. కొడుకులు చూడకపోయినా తను బ్రత గ్గలనన్నాడు సాంబులు. తనని కొడుకులు చూడకపోతే ఎక్కడికి పోవాలి. ఉద్యోగంనుండి రిటైర్ అయ్యాడు కానీ జీవితంనుండి రిటైర్ కావడానికి టైం రావడంలేదు మరి!

ఇటువంటి పరిస్థితిలో ఆత్మీయతని, తనపట్ల గౌరవాన్ని, అభిమానాన్ని, అనందాన్ని ఎలా పొందడం ఒక సారి సాంబుల్ని కలుసుకోవాలి.

* * *

రామ్మూర్తి చెప్పిన విషయాలు విని గుంభనంగా నవ్వేడు సాంబులు

"మీ విషయం అర్థమైంది సార్. మీరు మీ అబ్బాయి చెప్పులు తెచ్చి నప్పుడే అనుకున్నా మీరెట్టా బతుకు తున్నారో. అళ్ళు మిమ్మల్ని సూసే ఇదానం మీ సేతుల్లోనే వుందండి నేనో మాట సెప్తాను. ఆ రీతిని సెయ్యండి అళ్ళు కాస్త దారికొస్తారు. ఒకేళ అళ్ళు మామూలుగానే వున్నా మీకు ఎనకటి దిగులు, ఇసారం వుండవు" అన్నాడు సాంబులు. ఆపైన సాంబులు మాట సాయం చేసాడు. రామ్మూర్తిగారు తృప్తిపడ్డారు. వెంటనే అది అమలు చేసాడు.

* * *

నెలరోజుల తర్వాత-ఓ మధ్యాహ్నం వీధిలోంచి వస్తూ కొడుకుని పిలిచారు రామ్మూర్తిగారు. "ఏమిటీ" అన్నాడు నిలబడి.

"అలా కూర్చో. ఇదిగోరా ఈ యాభైరూపాయలు నీ దగ్గరుంచు. ఖాళీగావుంటే ఏమొస్తుందని కొందరు పిల్లలకు ట్యూషన్లు చెబుతున్నాను. నా ఖర్చులకని ఇదుగో ఈ పదీ వుంచు కున్నాను" అన్నాడు డబ్బు అందిస్తూ.

"మంచిపని చేసారు మావగారూ" అంది పెద్దకోడలు.

"నాన్నగారికి కాస్త కాఫీ వుంటే చూడు." అన్నాడు కొడుకు భార్యనుద్దే శించి.

ఆ మాటల్లో ఏదో మార్పు గోచరిం చింది రామ్మూర్తిగారికి. మొదటిసారిగా 'నాన్నగారూ' అన్నాడు కొడుకు. రామ్మూర్తిగారికి అర్థంకానిదొక్కటే. 'ఈ మార్పు స్వతహాగా తెచ్చిపెట్టు కున్నదా? లేక తను డబ్బిచ్చి కొని తెచ్చుకున్నదా?' అని.

చెమటతో తడిసిన చొక్కా చల్లగా హాయిగా వంటికి తగిలింది రామ్మూర్తి గారికి.



———